క్లుప్తంగా

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి

దుర్గి: రైతులు పంటలకు విత్తనాలు వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించుకొని అధిక దిగుబడికి సాధించేందుకు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి వై.అమీర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలస్థాయి భూసార పరీక్ష నమూనా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూమిలో ఏ ఏ లోపాలు ఉన్నాయో తెలుసుకోవటం, దానికి సంబంధించిన పరీక్షలు ఏ విధంగా నిర్వహించాలనే దానిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి నమూనా కనీసం 500 గ్రాములు ఉండేలా చూసుకొని సంబంధిత రైతుల వివరాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని సిబ్బందికి తెలిపారు. మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జిలు, వీఏఏలు, వీహెచ్‌ఏ, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

మాచవరం: భూసార పరీక్షలు చేపట్టడం వలన సాగు చేస్తున్న పంటలకు తగిన మోతాదులో ఎరువులు వాడకోవచ్చని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామ ఆర్బీకేలో మట్టి నమూనాల సేకరణ, పరీక్షలపై మండల స్థాయిలో రైతులకు అవగాహనా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం వలన పెట్టుబడులు తగ్గించుకోవచ్చని, భూమి ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలియజేశారు. క్షేత్రస్థాయిలో మట్టి సేకరణ విధానాన్ని వివరించారు. ఏఓ రామమ్మ, గ్రామ సర్పంచ్ అల్లాభక్షు, వీఏఓలు నర్సయ్య, కృష్ణవేణి, గోపి, యాకూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

దాచేపల్లి: స్థానిక మర్కస్ మసీద్, జామియా మసీద్‌లలో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. తొలుత మసీద్‌లలో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. ఉపవాసదీక్ష ముగిసిన తరువాత ఇఫ్తార్‌విందులో డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొని భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: మండల కేంద్రమైన పిడుగురాళ్ల గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5,6 తరగతిలో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ వనజ తెలిజేశారు. ఈ నెల 20వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. 5వ తరగతిలో ఎస్టీలకు 10 ఖాళీలు, 6వ తరగతిలో ఎస్టీలకు 10 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందన్నారు. ఈ నెల 29న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలియజేశారు. ఇంగ్లిష్ మీడియంలో చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. వివరాలకు 9963752436, 9441921023 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పిడుగురాళ్ల: ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరిస్తున్నామని వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాలే మాణిక్యరావు, కౌన్సిలర్ జడ సురేంద్ర, బీసీ నాయకుడు కుందుర్తి గురవాచారి తెలియజేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణదేవరాయలు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు తెలియజేశారు. సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ, 5గంటలకు విగ్రహ ఆవిష్కరణ, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. ఈ బైక్ ర్యాలీలో నియోజకవర్గంలోని అంబేడ్కర్ అభిమానులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు అందరు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య, కొక్కెర శ్రీనివాసరావు, కాంద్రకుంట కన్నయ్య, యనుమల వెంకటేశ్వర్లు, ఇర్లా గురుస్వామి, కో–ఆప్షన్ సభ్యుడు పిల్లి ప్రేమానందం, కౌన్సిలర్లు ఆనంద్, ఎస్‌కే సైదా, నరేష్, కొండలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

వెల్దుర్తి: మండలంలో కొత్తపుల్లారెడ్డిగూడెంలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గన్నెబోయి లింగయ్య ఈ నెల 11వ తేదీ మంగళవారం తెల్లవారుజామున కొత్తపుల్లారెడ్డి గూడెం నుంచి గుంటూరుకు వెళ్లే బస్సులో ఎక్కి యర్రబాలెం గ్రామంలో దిగినట్లు తెలిసింది. లింగయ్య వడ్డీ వ్యాపారం చేస్తారని తెలిసింది. ఉదయం 10గంటల నుంచి ఫోన్‌లో కూడా అందుబాటులో రాకపోవటంతో బంధువుల వద్దకు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే బుధవారం కూడా ఇంటికి రాకపోవటంతో ఆయన కోసం బంధువులు, తెలిసినవారి వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవటంతో భార్య గురవమ్మ వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో గురువారం లింగయ్య అదృశ్యంపై ఫిర్యాదు చేసింది. ఈ విషయం పై ఎస్‌ఐ కె.శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భారతరత్న అంబేడ్కర్ సదా స్మరణీయుడు

విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల: దేశానికి మహోన్నత రాజ్యాంగాన్ని అందించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సదా స్మరణీయుడని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం రాత్రి ఆవిష్కరించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నప్పుడు తాను పడిన కష్టాలు, అవమానాలు ఇంకెవ్వరూ పడకూడదనే ఆలోచనతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చదువే ఆయుధంగా చేసుకుని, ఉన్నత విద్యాభ్యాసం చేసి, పేదలు, దళితులను చైతన్య పరిచారన్నారు. వారి హక్కుల కోసం పోరాడారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలల, 18 రోజుల్లో రచించారన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, వాటి ఫలాలు అందరికీ అందేలా చూడాలనే ఆలోచన విధానంతో పాలకులు పనిచేయాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ వర్గాలు అందరూ ఆర్థికంగా పురోగతి చెందాలనే ఆలోచన విధానం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సైతం ఉందన్నారు. మహాత్ములను, మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), పార్టీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, ఎంపీపీ కె.నారాయణమ్మ బుజ్జి, సీపీఐ నాయకుడు షేక్ హుస్సేన్, మాలపాటి రత్నాకర్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కేబీఎస్ ప్రగతి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వి.అమరారెడ్డి, మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా, షేక్ పీర్ అహ్మద్ పాల్గొన్నారు.



బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

చినకొదమగుండ్ల సర్పంచ్‌గా కోటిరెడ్డి ప్రమాణస్వీకారం



కోటిరెడ్డిని అభినందిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పక్కన వీరారెడ్డి

కారెంపూడి: మండలంలోని చినకొదమగుండ్ల గ్రామ సర్పంచ్‌గా జెడ్డా కోటిరెడ్డి బుధవారం రాత్రి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) హాజరయ్యారు. ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి నూతన సర్పంచ్‌గా ఎన్నికైన కోటిరెడ్డి చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా కొనసాగిన యర్రంరెడ్డి వీరారెడ్డి గ్రామానికి చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదగా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్ మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం, మండల మహిళా విభాగం కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సయ్యద్ షమీర్ బాషా

రెంటచింతల: రాష్ట్రంలోనే ఎండలకు పేరుగాంచిన రెంటచింతలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రయాణికుల, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి రెంటచింతలలో మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్‌ఐ సయ్యద్ షమీర్‌బాషా అన్నారు. గురువారం స్థానిక ఆంధ్రబ్యాంక్ సమీపంలోని మీ–సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగకేంద్రం ద్వారా తీవ్రమైన ఎండకు చల్లని మజ్జిగను పంపిణీ చేసేలా ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు సాగరుమాత క్యాటరింగ్ నిర్వాహకులు ఇగుటూరి సత్యనారాయణరెడ్డి(సత్యం) సహకారంతో చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి, దుర్గిమార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెన్నా వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నా లింగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా శివారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పేరం రంగారెడ్డి, పోతులూరయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరి నినాదం 'మా నమ్మకం నువ్వే జగన్'

- విస్తృతంగా జగనన్నే మా భవిష్యత్
- ప్రజల నుంచి అపూర్వ స్పందన



కారెంపూడి ఆర్యవైశ్య వీధిలో కరపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ షఫీ, నాయకులు

కారెంపూడి: కారెంపూడిలో జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, కారెంపూడిలో గురువారం విస్తృతంగా పర్యటించారు. సాయిబాబా గుడి వీధి, ఆర్యవైశ్య వీధుల్లో కార్యక్రమం కొనసాగింది. జెడ్పీటీసీ షేక్ షఫీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, నాయకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇప్పటి వరకు అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

దుర్గిలో...

దుర్గి: మండలం పరిధిలో పలు గ్రామాలలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి గత 46 నెలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. అనంతరం వారి అనుమతితో జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్నే స్టిక్కర్‌ను అంటిస్తున్నారు. ముటుకూరు లో జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తోటకూర నాగేశ్వరరావు, ఎంపీపీ యేచూరి సాయి శంకర్, ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు. దుర్గిలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీటీసీ కటకం గోపాల్, నాయకులు కటకం చిన వెంకటయ్య, సర్పంచ్ చాట్ల శాంత రమేష్ పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులే గృహ సారథులని మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పూజల రామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతల గ్రామాలలోని పలు ప్రాంతాలలో వారు పార్టీ నేతలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఏపీ కుటుంబాలకు ఎంత మేర లబ్ధిచేకూరిందో వివరించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు మోర్తల ఉమ, మాజీ వైస్ సర్పంచ్ ఏరువ ప్రమీల విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రెంటచింతలలో కారు దగ్ధం

క్షేమంగా బయటపడ్డ పాస్టర్లు



రెంటచింతల: స్థానిక బాలాజీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సమీపంలో గురువారం మధ్యాహ్నం గురజాల నుంచి రెంటచింతల వైపు వస్తున్న ఓ కారు దగ్ధమైన సంఘటన జరిగింది. ఎస్‌ఐ సయ్యద్ షమీర్ బాష తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దాచేపల్లి నుంచి పాస్టర్లు బి.శ్యామ్ కుమార్, ఏసురత్నం, మైఖేల్‌లు మారుతి 800 కారులో రెంటచింతలకు వస్తుండగా అకస్మాత్తుగా కారు బానెట్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసి పడి కారంతా మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు క్షేమంగా బయటపడ్డారన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్‌లో సాయి మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో అంబేడ్కర్ ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి వ్యవస్థాపకుడు దేగల అబ్రహం మాట్లాడుతూ అంబేడ్కర్ అందరి వాడని, ఏ కులానికి సొంతం కాదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇశ్రాయేలు, మాచవరం మండల ఇన్‌ఛార్జి మంగళపల్లి లాజరు, దేగల మరియదాసు, తదితరులు ఉన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ గీతా హసంతి

సత్తెనపల్లి: ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగిని సంరక్షించటానికి ప్రథమ చికిత్స గురించి అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని గీతా మల్టీస్పెషాల్టీ వైద్యశాల అధినేత డాక్టర్ గీతా హసంతి అన్నారు.పట్టణంలోని వేద విద్యాసంస్థల పారా మెడికల్ విద్యార్థులకు ప్రథమ చికిత్స అవగాహన, బేసిక్ లైఫ్ సపోర్ట్ సెమినార్ ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సభకు అకాడమిక్ డైరెక్టర్ సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు.డాక్టర్ గీతా హసంతీ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా విద్యార్థులకు ప్రమాదాల పట్ల తీసుకో వలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించటం మంచి విషయమన్నారు. ఎటువంటి ప్రమాదం జరిగినా మొదటి గంట ఎంతో విలువైనదని దానిని గమనించి రోగికి వైద్య సహాయం అందించాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్ మాట్లాడుతూ విద్యార్థులు బేసిక్ లైఫ్ సపోర్ట్ తెలుసుకోవటం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఆపత్కాలంలో బాధితుల ప్రాణాలను కాపాడవచ్చున్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండి 50 కేజీల బరువు ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వలంటరీ డాక్టర్ షహనాజ్ పర్వీన్ విద్యార్థులకు ప్రథమ చికిత్స తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. కళాశాల డైరెక్టర్ చింతాడ రమేష్, రెడ్ క్రాస్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు పుట్టి సాంబశివ రావు, నర్సింగ్, పారా మెడికల్ అధ్యాపకులు గౌస్, నాగలక్ష్మి, సింధుషా, విజయశాంతి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన



మట్టి నమూనాలు తీసే విధానం పై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమారి, శ్రీధర్‌రెడ్డి

నకరికల్లు: భూసారపరీక్షలతో భూమికి అందించాల్సిన పోషకాలను గుర్తించి తగిన ఎరువులు పంటలకు అందించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టినమూనాల సేకరణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వాడకం వలన భూమిలోని సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందవన్నారు. ఫలితంగా పంటలకు సూక్ష్మపోషకాల లోపం ఏర్పడుతుందన్నారు. పంటల పెరుగుదలలో లోపాలు ఏర్పడి దిగుబడి, నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. భూసార పరీక్షలతో ప్రధానపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషకాలైన జింక్, ఐరన్, కాల్షియం, సల్ఫర్, బోరాన్ లభ్యతను గుర్తించవచ్చన్నారు. భూసార పరీక్షల ఆధారంగా భూమిలోని లోపాలను గుర్తించి వాటిని సూక్ష్మపోషకాల రూపంలో భర్తీచేయవచ్చన్నారు. ఆయాగ్రామాల రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి

సత్తెనపల్లి: విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం, సేంద్రియ ఎరువులు వాడటం తగ్గిపోవటం వలన నేల చౌడు బారుతుందని పల్నాడు జిల్లా నరసరావుపేట డీఆర్‌సీ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శివకుమారి అన్నారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు రైతు భరోసా కేంద్రంలో సత్తెనపల్లి మండలంలో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులకు నేల ఆరోగ్య పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణపై శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం వలన నేలలు ఉప్పు నేలలుగా మారే ప్రమాదం ఉందన్నారు. పరిష్కారంగా భూసార పరీక్షలు చేయించుకుని అవసరాన్ని బట్టి ఎరువులు వాడుకోవాలని సూచించారు. తద్వారా ఎరువులు పై పెట్టే ఖర్చు తగ్గించు కోవాలని, సూక్ష్మ పోషకాల లోపాలు సవరించుకొని దిగుబడులు పెంచుకోవాలి అని సూచించారు. మన నేలలో సేంద్రియ కర్బన పదార్థాలు చాలా తక్కువగా ఉన్నాయని, పశువుల ఎరువు, గొర్రెల, మేకల మంద కట్టడం, పచ్చి రొట్ట పైరులు పెంచుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి మాట్లాడారు. శిక్షణా కార్యక్రమం అనంతరం క్షేత్ర స్థాయిలో మట్టి నమూనాల తీసే విధానం పై అవగాహన కల్పించారు. సత్తెనపల్లి మండలంలో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నకరికల్లు: ఆన్‌లైన్ ద్వారా విద్యుత్‌బిల్లులు చెల్లింపులు చేసేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఏఈ రూఫస్ డానియేల్ బుధవారం తెలిపారు. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్, ఏపీసీపీడీసీఎల్ యాప్‌ల ద్వారా విద్యుత్‌బిల్లులు చెల్లించవచ్చన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించిన వారికి సర్‌చార్జి, లేట్ ఫీజు పెనాల్టీ రద్దుచేస్తామన్నారు.

నేడు ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నూతన ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్‌ల ప్రారంభోత్సవం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ గురువారం తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ హాజరవుతారన్నారు.

ఏరియా వైద్యశాలకు స్ట్రెక్చర్ల వితరణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో దాత చెరుకూరి వెంకట్రావు సహకారంతో సుమారు రూ.20 వేల విలువ గల స్ట్రెక్చర్లను గురువారం అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ అత్యవసరం ఉన్న మౌలిక వసతులను ఎప్పటికప్పుడు వైద్యశాలకు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అందిస్తున్నారని కొనియాడారు. కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ తాము అడగ్గానే స్పందించి స్ట్రెక్చర్లను అందించిన ఎరుకూరి వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌ఎంఓ శోభరాణి, డాక్టర్ లక్ష్మణ్‌రావు, డ్యూటీ డాక్టర్ నవ్య, హెడ్ నర్స్ రమణమ్మ, తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని బస్టాండ్ వద్ద రమణ మేడమ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రం ప్రారంభించారు. బైరెడ్డి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె బైరెడ్డి వెంకట రమణ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కత్తెరపు రంగారెడ్డి, బుర్రి వెంగళరెడ్డి, పమ్మి బ్రహ్మారెడ్డి, పందిరి మల్లారెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై సూచనలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు

మాచర్ల రూరల్: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపడదామని ఎంపీడీఓ వి.కోటేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని కంభంపాడు, గన్నవరం, రాయవరం, కొత్తపల్లి, పశువేముల, తాళ్లపల్లి, లచ్చంబావి, కొత్తూరు, పశువేముల గ్రామాలలోని సచివాలయాలలో అధికారులు గృహ లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు సెంటున్నర స్థలాన్ని అందించి చక్కని లేఅవుట్ వేసి విద్యుత్, నీరు, వసతి కల్పిస్తున్నామని, వీటిలో వెంటనే గృహ నిర్మాణాలు చేపట్టి సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని కోరారు. ప్రభుత్వం సబ్సిడీ పై ఇసుక, ఇటుక, సిమెంట్‌ను అందిస్తున్నటు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ డీఈ బాలాజీ నాయక్, సర్పంచి ఓరుగంటి చిన్నా, యంద్ర గాలయ్య, ఆరికట్ల చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, కె.శివారెడ్డి, పంచాయితీ సెక్రటరీలు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై సమీక్ష సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జి.రమేష్

మాచర్ల రూరల్: రైతులందరికీ శాశ్వత భూ హక్కు కల్పించే జగనన్న రీ సర్వేలో వీఆర్‌ఓలు, సచివాలయ సర్వే బృందం సమష్టిగా పనిచేసి నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని తహసీల్దార్ జి.రమేష్ కుమార్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ, ఆర్ఐ, వీఆర్‌ఓలు సచివాలయ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేలో ప్రతి ఒక్క అధికారి పాల్గొని సకాలంలో ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే స్పందన దరఖాస్తులు, రెవెన్యూకు సంబంధించిన ప్రతి అర్జీని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, ఆర్‌ఐలు ఫణీంద్ర కుమార్, నిమ్మల శ్రీనివాసరావు, సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్‌ఓలు జీరయ్య, ఎండీ హుస్సేన్, నాగేశ్వరరావు, ప్రశాంతి, కొండలు, భాస్కర్, చిరంజీవిలు పాల్గొన్నారు.

ఘనంగా కాళికామాత ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో కాళికామాత

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామంలోని కాళికామాత ఆలయ 14వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటం గ్రామ ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారిని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు యరవెద బ్రదర్స్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం



మండాది జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

వెల్దుర్తి: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మండాది జిల్లా ఉన్నత పాఠశాలలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చక్రధర్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాలలో మొక్కలు నాటడంతో పాటు పాఠశాల పరిసరాలలో ఉన్న చెత్త చెదారాన్ని ఏరివేశారు. పర్యావరణ పరిరక్షణ గురించి పాఠశాల విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో నీటి ఆవశ్యకత, అక్షరాస్యత, పర్యావరణం గురించి సర్వే నిర్వహించి, అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.వెంకటేష్, గ్రామ సర్పంచ్ శీలం సైదారెడ్డి, ఎంపీటీసీ కాంతారావు, బి.లింగారెడ్డి, హెచ్‌ఎం అరుణ కుమారి, భీమనపాటి వెంకటరెడ్డి, చినపరెడ్డి చినమల్లారెడ్డి, చక్రధర్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

పిడుగురాళ్ల: మండలంలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాలను గురువారం పల్నాడు జిల్లా పరిశీలకులు చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న విద్యా కానుక సామగ్రిని, మండల స్థాయిలో స్టోర్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం కేజీబీవీని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఏఎంఓ శ్రీనివాసరావు, ఎంఈఓ రాజు, సీఆర్‌పీలు, ఏఎస్‌ఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

దాచేపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ షేక్ బిలాలుద్దీన్ గురువారం తెలిపారు. మద్యం అక్రమ రవాణాలో పట్టుబడిన 13 వాహనాలను వేలం వేస్తున్నామని, ఆసక్తి కలిగినవారు ఈ వేలంలో పాల్గొన్నవచ్చని ఆయన చెప్పారు.